

కొనసాగుతున్న పొగమంచు

పాడేరు: ఏజెన్సీలో కొద్దిరోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. బుధవారం ఉదయం 8 వరకు మంచు తెరలు వీడలేదు.



ఘనంగా జలాభిషేకం

విశాఖ నగరం దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారికి భక్తులు బుధవారం పెద్ద ఎత్తున జలాభిషేకం నిర్వహించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం

36.3/26.2

తేలికపాటి వర్షం, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి బుధవారం తెలిపారు.

న్యూస్‌రీల్

వైభవుడికి ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో పాల్గొన్న ఈవో బండారు ప్రసాద్, ఇతర భక్తులు

మురళీనగర్ (విశాఖ): కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం వైభవుడికి ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామికి సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలభోగం, మంగళాశాసనం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్వరణ, రక్షాసూత్రబంధన, మృత్సంగ్రహణం, మహానివేదన చేపట్టారు. మంగళవారం రాత్రి ఊంజల్ సేవ నిర్వహించి, బుధవారం ఉదయం తిరువీధి మహోత్సవం జరిపించారు. గురువారం ఉదయం 6 గంటలకు పౌర్ణమి సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తామని ఈవో బండారు ప్రసాద్ తెలిపారు.

మరికొన్ని రైళ్లకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు వాల్తేర్ డివిజన్ పరిధిలో పలు రైళ్లకు అత్యాధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జత చేస్తున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల 24 నుంచి విశాఖపట్నం–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(22801) వీక్లీ ఎక్స్‌ప్రెస్, 25 నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–విశాఖపట్నం(22802) వీక్లీ ఎక్స్‌ప్రెస్, 26 నుంచి విశాఖపట్నం–పారాదీప్(22810) వీక్లీ ఎక్స్‌ప్రెస్, 27 నుంచి పారాదీప్–విశాఖపట్నం(22809) వీక్లీ ఎక్స్‌ప్రెస్, 28 నుంచి విశాఖపట్నం–కర్నూల్ టౌన్ (08585) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 29 నుంచి కర్నూల్ టౌన్–విశాఖపట్నం(08586) సమ్మర్‌స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జతచేయనున్నారు.

పట్టుకుంటే బంగారం

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- పట్టు పరిశ్రమకు పెరుగుతున్న ఆదరణ
- రాయితీలతో ప్రభుత్వ ప్రోత్సాహం
- వేసవిలో దిగుబడి మందగించినా.. వర్షాకాలంలో లాభాల బాటే



కోటవురట్ల మండలంలో మల్బరీ సాగు (ఫైల్)



గుడ్డు దశలో ఉన్న పట్టు పురుగు

సాక్షి, అనకాపల్లి: పట్టు రైతుల ఆశలు పండుతున్నాయి. మార్కెట్‌లో మంచి ధరలుండటంతో సాగు లాభదాయకమవుతోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని రైతులు ఆర్జిస్తున్నారు. వేసవిలో ఉష్ణతాపంతో దిగుబడి మందగించినా.. వర్షాకాలంలో అధిక లాభాలార్జించే అవకాశాలున్నాయి. పట్టు పురుగులు ఆరోగ్యంగా, బలంగా ఉంటేనే ఈ గూళ్ల నుంచి సిల్క్ ఎక్కువగా వస్తుంది. ఆదాయం బావుంటుంది. ఈ పురుగులు మల్బరీ ఆకులను తిని గూళ్లను అల్లుతాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మెటీరియల్ కాంపోనెంటు కింద ప్రభుత్వం షెడ్ల నిర్మాణాలకు సబ్సిడీలు ఇస్తోంది. మల్బరీ సాగుకు, పట్టు పురుగుల పెంపకానికి కూడా రాయితీలు అందిస్తోంది. జిల్లాలో పట్టు పరిశ్రమకు ఆదరణ పెరుగుతోంది. తక్కువ పెట్టుబడితో రైతులు అధిక లాభార్జించేలా పట్టు పెంపకం జరుగుతోంది. కరోనా తరువాత నుంచి ప్రతి ఏడాది సాగు పెరుగుతూనే ఉంది.

ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం...

- ఒక ఎకరా మల్బరీ సాగుకు - రూ.25 వేలు (రూ.18,750 సబ్సిడీ)
- రెండు రకాలుగా పట్టుపురుగుల పెంపకం జరుగుతోంది.
  టైపు-1లో షెడ్డు కోసం రూ.4 లక్షలు (రూ.3.16 లక్షల సబ్సిడీ). పట్టు పురుగుల పెంపకానికి రూ.75 వేలు (రూ.56,250 సబ్సిడీ)
  టైపు-2లో షెడ్డు కోసం రూ.3 లక్షలు (రూ.2.25 లక్షల సబ్సిడీ). పట్టు పురుగుల పెంపకానికి రూ.50 వేలు (రూ.37,500 సబ్సిడీ)
- వీటితోపాటు చాకి పురుగుల కొనుగోలుకు 100 గుడ్లకు రూ.1,000 సబ్సిడీ
- వ్యాధి నిరోధక మందులకు రూ.5,000 (రూ.3,750 సబ్సిడీ)



పట్టు పురుగులకు మల్బరీ ఆకులే ఆహారం



పట్టు పురుగుల పెంపకం

ఏడాదిలో 6 పంటలు.. రూ.1.2 లక్షల ఆదాయం

రెండు ఎకరాల మల్బరీ తోటలో ప్రతి పంటకు 200 పట్టుగుడ్ల వరకు పెంచుతారు. ప్రతీ ఏటా దాదాపు 5 లేదా 6 పంటలు పండిస్తారు. ఏడాదికి ఆదాయం రూ. 1,20,000 వరకు వస్తుంది. రెండు ఎకరాలను రెండు భాగాలుగా విభజించి పండిస్తే ఆదాయం రెట్టింపు అవుతుంది. జిల్లాలోని 15 మండలాల్లో 126 మంది రైతులు 284 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం పట్టు పరిశ్రమను చేపట్టారు. చిన్నకారు, సన్నకారు రైతులకు ఈ పట్టు పరిశ్రమ అనుకూలంగా వుంటుంది. ఇది కుటీర పరిశ్రమ కనుక మహిళలను ఎక్కువగా భాగస్వాములను చేయవచ్చు. ఒకసారి మల్బరీ తోట నాటితే 15 ఏళ్ల వరకు ప్రతీ ఏటా సగటున 5 పంటలు పండించొచ్చు.

ఉష్ణోగ్రతల నియంత్రణ

పట్టు పురుగులు అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోలేవు. వీటికి గరిష్టంగా 28 డిగ్రీల ఉష్ణోగ్రతలు మాత్రమే ఉండాలి. ఈ ఉష్ణ తాపం నుంచి పట్టు పురుగును సంరక్షించుకోగల్గితే అధిక ఆదాయాలు ఆర్జించవచ్చు. వచ్చే నెల జూన్ 15 వరకు ఎండల తీవ్రత కారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంటుంది. మనకు అందుబాటులో ఉన్న వస్తువులతోనే పురుగులు ఉన్న షెడ్లో ఉష్ణోగ్రతలను నియంత్రించుకోవాల్సిన అవసరం ఉంది. ఎండుగడ్డి, చొప్పగడ్డి లేదా వెదురుతో తయారు చేసిన తడికెలను షెడ్‌లపై వేసుకుని తేమ ఆరకుండా ఎప్పటికప్పుడు తడుపుతూ ఉండాలి. కిటికీలకు గోనెసంచులు కట్టి వాటిని కూడా ఎప్పటికప్పుడు నీటితో తడుపుతూ ఉండాలి. దీనికోసం జిల్లాలో సెరికల్చర్ అధికారులు వేసవి సీజన్‌కు ముందు నుంచే పట్టు రైతులకు అవగాహన కల్పించి, శిక్షణ అందిస్తారు. పురుగు పెరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు ఇస్తారు.

మల్బరీ సాగుపై పెరుగుతున్న ఆసక్తి



మార్కెట్‌లో పట్టు గూళ్ల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో బైవోల్టిన్ పట్టు గూళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. గతేడాది కంటే ఈ ఏడాది మల్బరీ సాగుకు ప్రభుత్వం సబ్సిడీ పెంచింది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం రాయితీ ఉంటుంది. ఈ ఏడాది కొత్తగా 75 ఎకరాల్లో పట్టు పురుగుల సాగు చేపట్టేలా లక్ష్యం పెట్టుకున్నాం. లక్ష మల్బరీ మొక్కలు 20 ఎకరాలకు సరిపోతాయి. జిల్లాలో 75 ఎకరాలకుగాను నాలుగు లక్షల మొక్కలు కావాల్సి ఉంటుంది. మూడు లక్షల మల్బరీ మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. మిగతా లక్ష మొక్కలను తూర్పు గోదావరి జిల్లాలో ప్రైవేట్ వారి నుంచి ఇండెంట్ కూడా తీసుకోవడం జరిగింది. పట్టు దిగుబడి ఎక్కువగా సెప్టెంబర్– ఫిబ్రవరి మధ్య ఉంటుంది. జిల్లాలో పట్టుగూళ్ల ఉత్పత్తి పెరిగింది. కొత్త రైతులు కూడా మల్బరీ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

– రాజేంద్రప్రసాద్‌బాబు, సెరికల్చర్ జిల్లా అధికారి

తాండవలో ఇసుక తవ్వితే కేసులు

- నది ప్రాంతాలను పరిశీలించిన అధికారులు



నదిలో ఇసుక తవ్వకాలను కట్టడి చేస్తూ రోడ్డుకు అడ్డంగా కట్టిన కర్రను పరిశీలిస్తున్న అధికారులు

నాతవరం: తాండవ నదిలో ఇసుక తవ్వకాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఈబీ ఎస్ఐ ఎస్.కె.రహీమ్ హెచ్చరించారు. బుధవారం ఆయన గనుల శాఖ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి చిక్కుడుపాలెం వద్ద తాండవ నదిలో నిర్మించిన తాగునీటి పైలెట్ ప్రాజెక్టును సందర్శించారు. ఇటీవల కొంతమంది అక్రమార్కులు ఇక్కడ పైలెట్ ప్రాజెక్టు ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేస్తున్నట్లుగా సమాచారం అందింది. ఈ మేరకు అన్ని శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. నది సమీపంలో రైతులను, ప్రజలను ఇసుక తవ్వకాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు వద్దకు వెళ్లే మార్గంలో ఇసుక తరలించకుండా అడ్డుగా ఏర్పాటు చేసిన కర్రను పరిశీలించారు. ఇటీవల నదిలో ఇసుక తవ్వకాలు జరగలేదని ఈ సందర్భంగా ఎస్ఈబీ ఎస్ఐ తెలిపారు. ఇసుక తవ్వకాలు చేస్తే తాగునీటి పైలెట్ ప్రాజెక్టుకు ప్రమాదం పొంచి ఉందన్నారు. అందువల్ల ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేయకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా తాండవ నది పొడవునా ఎలాంటి ఇసుక తవ్వకాలు చేయకుండా అన్ని శాఖల అధికారులు సంయుక్తంగా దాడులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. గనుల శాఖ జేఈ హరకుమార్‌నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న ఎస్ఈబీ ఎస్ఐ రహీమ్, గనుల శాఖ జేఈ హరికుమార్

శ్రీలంకకు ఇండియన్ ఆయిల్ ప్రీమియం ఇంధనం

బీచ్‌రోడ్డు: శ్రీలంకకు ప్రీమియం ఇంధనం ఎక్స్‌పీ100ని ఎగుమతి చేయనున్నట్టు ఇండియన్ ఆయిల్ డైరెక్టర్ వి.సతీష్ కుమార్ తెలిపారు. ఎగుమతి వివరాలను మీడియాకు బుధవారం వివరించారు. మొదటిసారి 100 ఆక్టేన్ పెట్రోల్ ఎక్స్‌పీ100 దేశీయంగా అభివృద్ధి చేసినట్టు చెప్పారు. నవీ ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ నుంచి సుపీరియర్ 100 ఆక్టేన్ ప్రీమియం ఇంధనం ఎక్స్‌పీ 100ని మొట్టమొదటిసారిగా ఎగుమతి చేసినట్టు తెలిపారు. ఈ ఉత్పత్తిని శ్రీలంకకు ఎగుమతి చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మకమైన రోజన్నారు. ఈ ఇంధనాన్ని హై ఎండ్ వాహనాల కోసం రూపొందించినట్టు తెలిపారు. ఎక్స్‌పీ100 శ్రీలంకలోని తమ కస్టమర్లకు అత్యుత్తమ పనితీరును అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. దేశం నుంచి ప్రపంచానికి నాణ్యమైన ఉత్పత్తులను పంపగల సామర్థ్యాన్ని ఇది ప్రదర్శిస్తుందని తెలిపారు.

పీహెచ్‌సీలు పరిపుష్టం



అదనపు భవనం మంజూరైన గునుపూడి పీహెచ్‌సీ



నాతవరం పీహెచ్‌సీలో నూతనంగా నిర్మించిన అదనపు భవనం

- 7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.3.5 కోట్ల మంజూరు
- రూ.50 లక్షల చొప్పున అదనపు భవనాల నిర్మాణం
- తీరనున్న వసతి సమస్య
- మందుల నిల్వలకు తొలగనున్న ఇబ్బందులు

నాతవరం: గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలందించడం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిపుష్టం చేస్తోంది. దశాబ్దాలుగా శిథిల భవనాల్లోనూ అద్దె కొంపల్లోనూ అరకొర వైద్య సేవలతో నడిచే వీటికి జీవం పోసింది. ఇప్పటికే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణతో రోగుల తాకిడి పెరగడంతోపాటు మందులు నిల్వలకు వసతి సమస్య ఏర్పడింది. ఈ నేపథ్యంలో రూ.10 కోట్లతో జిల్లాలో పలు పీహెచ్‌సీలకు అదనపు భవనాలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించింది. మరో రూ.5.25 కోట్లతో ప్రహరీలు, భవనాలకు మరమ్మతులు పూర్తి చేసింది.

జిల్లాలో 50 పీహెచ్‌సీలు, 9 యూపీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రస్తుతం ఏడు పీహెచ్‌సీలో అదనపు భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.50 లక్షల వంతున రూ.3.50 కోట్లు మంజూరు చేసింది. ఆయా భవనాలు నిర్మించే బాధ్యత ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులకు అప్పగించారు. అదనపు భవనాలు సకాలంలో పూర్తి చేస్తే పీహెచ్‌సీల్లో శాశ్వతంగా వసతి సమస్య తీరుతుంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పీహెచ్‌సీల్లో వైద్యం చేయించుకునే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనివల్ల పీహెచ్‌సీలకు అధికంగా మందులు స్టాకు చేయడం పూర్తిస్థాయిలో సిబ్బంది నియమించడం వల్ల వసతి సమస్య ఏర్పడింది. ఈ నేపథ్యంలో అటువంటి పీహెచ్‌సీలను ఏడు గుర్తించి అదనపు భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

పీహెచ్‌సీల అదనపు భవనాల నిర్మాణానికి రూ.50 లక్షల వంతున మంజూరు

మండలం పేరు	పీహెచ్‌సీ పేరు
నాతవరం	గునుపూడి
దేవరాపల్లి	దేవరాపల్లి
అనకాపల్లి	తగరంపూడి
మునగపాక	మునగపాక
బుచ్చెయ్యపేట	బుచ్చెయ్యపేట
పరవాడ	వాడచీపురుపల్లి
ఎస్.రాయవరం	పెనుగొల్లు

రూ.10 కోట్లతో పలు పీహెచ్‌సీల్లో అదనపు భవనాలు పూర్తి

ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ఏర్పాటుతోపాటు ప్రతి రోగికి వైద్యం సకాలంలో సక్రమంగా అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను నియమించింది. వైద్యులకు సిబ్బందికి రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వసతి సమస్య ఉన్న పీహెచ్‌సీల్లో రూ.10 కోట్లతో అదనపు భవనాలు నిర్మించి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. నాతవరంలో 1962 నిర్మించిన పీహెచ్‌సీలోనూ వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడ వైద్య సిబ్బంది, రోగుల వసతి సమస్యపై ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రూ.1.65 కోట్లతో అదనపు భవనం నిర్మించి ప్రారంభోత్సవం చేశారు.

రూ.5.25 కోట్లతో పీహెచ్‌సీలకు ప్రహరీలు, మరమ్మతులు

గతంలో చాలా పీహెచ్‌సీలకు ప్రహరీలు లేక రోగులు, వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడేవారు. పశువుల సంచారంతోపాటు రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారేవి. కొన్ని పీహెచ్‌సీలు వర్షాకాలంలో కారిపోతుండేవి. మందులు భద్రపరచడానికి ఆపసోపాలు పడేవారు. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీలకు రూ.5.25 కోట్లు మంజూరు చేశారు. వీటితో ప్రహరీల నిర్మాణాలు, పలు భవనాలకు మరమ్మతులు చేపట్టారు.

చీడిగుమ్మలకు పీహెచ్‌సీ మంజూరు

గొలుగొండ మండలం చీడిగుమ్మలలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పీహెచ్‌సీ మంజూరు చేసింది. దీన్ని నిర్మించేందుకు అవసరమైన భూమిని రెవెన్యూ అధికారులు సమకూర్చారు. నూతన పీహెచ్‌సీ పనులు సకాలంలో పూర్తి చేసే దిశగా ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

టెండర్లు పూర్తయిన వెంటనే పనులు



జిల్లాలో ఏడు పీహెచ్‌సీలకు అదనపు భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– నారాయణరెడ్డి, జేఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, నర్సీపట్నం

వసతి సమస్య తీరుతుంది



ప్రతి పీహెచ్‌సీకి రోగుల సంఖ్య పెరిగింది. జగనన్న ఆరోగ్య సురక్ష సేవల కోసం వినియోగించే మందులు అధికంగా రావడంతో స్టాకు చేసేందుకు కొన్ని పీహెచ్‌సీల్లో వసతి చాలటం లేదు. కొత్తగా మంజూరైన నిధులతో అదనపు భవనాలు నిర్మిస్తే వసతి సమస్య తీరుతుంది.

– మీరా జ్యోతి, అదనపు డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

గర్సింగిలో గిరినాగు హల్‌చల్



దేవరాపల్లి : మండలంలో గర్సింగి గ్రామంలో గిరినాగు హల్‌చల్ చేసింది. బుధవారం రంసాల ఈశ్వరావు ఇంటి సమీపంలో గిరినాగు హల్‌చల్ చేసింది. దీనిని గ్రామస్తులు హతమర్చారు. బుధవారం ఉదయం ఇంటి వెనుక భాగం నుంచి ఇంటిలోకి చొరబడుతుండగా, దీనిని చూసిన స్థానికులను కొంత సేపు పరుగులు పెట్టించింది. చివరకు దానిని కర్రలతో కోట్టి హతమర్చారు. దీంతో చుట్టు పక్కల వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఇంటర్ విద్యార్థులకు తత్కాల్ అవకాశం

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేందుకు తత్కాల్ అవకాశం కల్పించినట్లు ఆర్ఐవో పి.మురళీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతున్నాయన్నారు. అయితే అనివార్య కారణాలతో ఫీజు చెల్లించలేని విద్యార్థులు తత్కాల్ విధానంలో గురువారం మధ్యాహ్నం 12 గంటల్లోపు నెట్ బ్యాంకింగ్ ద్వారా ఫీజు చెల్లించినట్లయితే పరీక్షలకు అనుమతిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు తగిన చొరవ తీసుకోవాలని సూచించారు.

పట్టుబడ్డ వాహనాల వేలం

చోడవరం రూరల్: గంజాయి అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను ఈ నెల 28న వేలం వేయనున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బిహెచ్.కిరణ్మనేశ్వరి తెలిపారు. చోడవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో జరిపిన గంజాయి అక్రమ రవాణాదారులపై జరిపిన దాడుల్లో బజాజ్ డిస్కవర్ బైకు, టాటా వింగర్ వేన్‌లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు వీటి వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వారు 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు వెయ్యి రూపాయల ధరావత్తు సొమ్మును చెల్లించి పేరును నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. వేలం పాటలో అధిక మొత్తానికి పాడిన వారికి వాహనాలను కేటాయిస్తామని, 28న జరిగే పాట అనంతరం తాము పాడిన మొత్తాన్ని అదే రోజు చెల్లించి వాహనాలను పొందాల్సి ఉంటుందని, వేలం మొత్తానికి అదనంగా జీఎస్టీని పాటదారే చెల్లించాలని తెలిపారు. వేలం నిర్వహణ తదితర అంశాలలో ఉన్నతాధికారుల ఆదేశాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు.

నమో నారసింహ

- సింహగిరిపై వైభవంగా శ్రీనృసింహ హోమం
- తొలిసారిగా ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా పెద్ద ఎత్తున నిర్వహణ
- స్వామి సేవలో తరించిన ఉభయదాతలు



ప్రధాన కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని తీసుకొస్తున్న ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు



హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం, నృసింహ జయంతి సందర్భంగా బుధవారం సింహగిరిపై నృసింహ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. తొలిసారిగా ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. నృసింహ నామస్మరణలో భక్తులు మునిగి తేలారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ముందుగా చక్రపెరుమాళ్, స్వామి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేర్వేరు పల్లకీల్లో.. వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయంలోంచి ఊరేగింపుగా హోమ ప్రాంగణానికి తీసుకొచ్చారు. స్వామి ఉత్సవమూర్తులను వేదికపైన, చక్రపెరుమాళ్లను హోమగుండం వద్ద అధిష్ఠింపజేశారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారణ చేసి ఆశీనింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమాన్ని విశేషంగా నిర్వహించారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలందరిచేత స్వామి అష్టోత్తరనామావళిని పఠింపజేశారు. అనంతరం పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ కార్యక్రమాన్ని విశేషంగా చేపట్టారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానార్చకుడు గొడవరి శ్రీనివాసాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి.. స్వామి మూలవిరాట్‌కి సమర్పించారు. అనంతరం ఆ జలాలను యజ్ఞశాలకు తీసుకొచ్చి భక్తులపై చల్లారు. దేవస్థానం తరపున ఉభయదాతలకు స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రిలిగ్రిమ్స్ సెంటర్‌లో భోజనం సదుపాయం కల్పించారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులు, ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యులు పాల్గొన్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకులు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, పారాయణదారులు, వేదపండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



హోమంలో పాల్గొన్న భక్తులు



పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నాడు- నేడు నిధుల దుర్వినియోగంలో హెచ్‌ఎం సస్పెన్షన్

- విశాఖ ఆర్జేడీ నుంచి ఉత్తర్వులు



అసంపూర్తిగా నాడు-నేడు పాఠశాల భవనం

రోలుగుంట: మండలంలో బీబీపట్నం ప్రభుత్వ పాఠశాలకు మంజూరైన నాడు-నేడు నిధులు దుర్వినియోగానికి పాల్పడిన హెచ్‌ఎం బాబ్జీరావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు విశాఖ ఆర్జేడీ భాస్కరరావు నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ పాఠశాలకు నాడు-నేడు పథకం కింద రెండో విడతలో రూ.61 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాల యాజమాన్య కమిటీ ఆమోదంతో భవన నిర్మాణ పనులు చేయాలి. ఇందుకు విరుద్ధంగా ఇక్కడ హెచ్‌ఎం బాబ్జీరావు కమిటీ చైర్మన్ కిశోర్‌తో ముందుగానే చెక్కులపై సంతకం చేయించుకుని నిధులు డ్రా చేసి తూతూమంత్రంగా పనులు చేశారు. గతేడాది జూన్‌లో సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడ నుంచి వేరొక మండలానికి హెచ్‌ఎం వెళ్లిపోయారు. ఈ స్థానంలో నక్కపల్లి మండలం నుంచి బదిలీపై వచ్చిన మరొక హెచ్‌ఎం ఎన్. అప్పారావును త్వరితగతిన నాడు నేడు పనులు పూర్తి చేయాలని విద్యా శాఖ, ఇంజనీరింగ్ అధికారులు ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో నిధులు విడుదల, చేసిన పనులకు వ్యత్యాసం ఉండడం, అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించి పూర్వ హెచ్‌ఎంపై ప్రస్తుత హెచ్‌ఎం ఎంఈవోకు, డీఈవోకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి నివేదికలు అందజేయాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆదేశించారు. ఈ మేరకు గతేడాది నవంబర్‌లో ఎస్.ఎస్.ఎ డీఈ జగదీష్, ఎంఈవో జానుప్రసాద్ ఇక్కడ నుంచి బదిలీ అయిన హెచ్‌ఎం బాబ్జీరావును, కమిటీ చైర్మన్ కిశోర్‌ని, విద్యార్థుల తల్లిదండ్రులను హాజరుపరచి విచారించి నివేదిక సంబంధిత శాఖ అధికారులకు అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా నిధులు దుర్వినియోగానికి పాల్పడిన హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎంఈవో బుధవారం తెలిపారు.

ఏలేరు కాలువలో మృతదేహం లభ్యం

కోటనందూరు/కోటకోట : మండలంలోని తీడ గ్రామం వద్ద ఏలేరు కాలువలో కొట్టుకు వచ్చిన మృతదేహాన్ని బుధవారం వెలికి తీసినట్టు సీఐ ఎం. వినోద్‌బాబు విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. మాకవరపాలెం మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన రాజాన మల్లేశ్వరరావు (44) మంగళవారం సాయంత్రం తన గ్రామం వద్ద ఏలేరు కాలువ గట్టుకు కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ కాలు జారి కాలువలో పడిపోయాడు. దీంతో అక్కడి నుంచి ప్రవాహంలో కొట్టుకొని వచ్చి మండలంలోని తీడ గ్రామం వద్ద శవమై తేలాడు. అతని బంధువులు అతని కోసం వెతుక్కుంటూ ఇక్కడకు వచ్చి మల్లేశ్వరరావు మృతదేహాన్ని గుర్తించారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి, అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య రాజ్యలక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పలు పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా చేరిన కారణంగా.. ఆయా స్టేషన్ల నుంచి రైళ్లు ఆలస్యంగా బయలుదేరినట్లు రైల్వే అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం 10.35 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరింది. రాత్రి 8గంటలకు విశాఖపట్నంలో బయలుదేరాల్సిన విశాఖపట్నం-నాందేడ్ (20811) ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా రాత్రి 9.30 గంటలకు బయల్దేరింది. రాత్రి 11.20 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరాల్సిన విశాఖపట్నం-లోకమాన్యతిలక్ టెర్మినస్(18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ సుమారు గంట ఆలస్యంగా మధ్యరాత్రి 12.20 గంటలకు బయల్దేరింది.

దారి మళ్లింపు

తిరుపతి-కాట్పడి సెక్షన్ పరిధి బొమ్మ సముద్రం స్టేషన్ వద్ద జరుగుతున్న లూప్‌లైన్ పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల 27న ఎస్ఎంవీ బెంగళూరు-టాటానగర్ (12890) ఎక్స్‌ప్రెస్, 28, 30వ తేదీల్లో ఎస్ఎంవీ బెంగళూరు-హతియా(12836) ఎక్స్‌ప్రెస్ వయా కాట్పడి-మెల్పక్కం, రేణిగుంట మీదుగా నడుస్తాయి.

- ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల కారణంగా జూన్ 6న చెన్నై సెంట్రల్-న్యూ జల్పాయ్‌గురి(22611) ఎక్స్‌ప్రెస్ వయా టాటానగర్-పురూలియా-కోట్‌శిలా స్టేషన్ల మీదుగా నడుస్తుంది.

క్రీడా కోటాలో దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు



గణేష్‌ను శాలువాతో సత్కరిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి : జాతీయస్థాయి క్రీడల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశాలు కల్పిస్తున్నాయని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక వివేకానందనగర్ తమ కార్యాలయంలో బుధవారం ఎస్.రాయవరం మండలం సోమిదేవిపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగ క్రీడాకారుడు అన్నం గణేష్ చైనాలో త్వరలో జరిగే వరల్డ్ బీచ్‌పారా ఒలింపిక్స్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనందుకు ఆమె శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చైనాలో జరిగే పోటీల్లో విజయం సాధించి, దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కోరారు. ఇటీవల కాలంలో దివ్యాంగులకు ప్రభుత్వం వివిధ రకాలైన క్రీడాపోటీలను నిర్వహించి వారిలో ప్రతిభను వెలికితీస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల యశ్వంత్, ఎస్.రాయవరం మండలం వైఎస్సార్‌సీపీ నాయకుడు కొణతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి



మృతుడు పక్కుర్తి లక్ష్మణరావు(42)

యలమంచిలి రూరల్ : యలమంచిలి మండలం లక్కవరం గ్రామానికి సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నక్కపల్లి మండలం దోసలపాడు గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి పల్లా లక్ష్మణరావు(42) దుర్మరణం చెందాడు. నక్కపల్లి మండలం దోసలపాడు, ముకుందరాజుపేటకు చెందిన పల్లా లక్ష్మణరావు, కోర్ని రమణలు, డెంకాడ గ్రామానికి చెందిన ఉద్దండం గిరీష్,కాపారవు నాగేంద్రలు రెండు ద్విచక్ర వాహనాలపై గాజువాకలో తాపీ పని కోసం బయలుదేరారు. మార్గమధ్యంలో యలమంచిలి మండలం లక్కవరం వద్దకు చేరుకోగానే ఓ లారీని తప్పించబోయి రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానినొకటి ఢీకొట్టి బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో దోసలపాడుకు చెందిన పల్లా లక్ష్మణరావు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో ద్విచక్రవాహనం నడుపుతున్న ఉద్దండం గిరీష్ ఎడమ చేయి విరిగిపోయింది. అతడిని మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి బంధువు పక్కుర్తి నాగేశ్వర్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ సైలా సింహాచలం తెలిపారు.

ట్రాక్టర్ విడిభాగాల చోరీ



విడిభాగాలు చోరీ అయిన ట్రాక్టర్, పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసులు

రోలుగుంట : రోలుగుంట మండల కేంద్రం పరిసరాల్లో గల సహస్ర స్టోన్ క్రషర్ వద్ద గల ట్రాక్టర్ల విడిభాగాలు గత కొన్ని నెలలుగా వరుస చోరీలు జరుగుతున్నాయి. రోలుగుంట గ్రామానికి చెందిన బణికల దేముడు ఈ స్టోన్ క్రషర్ నుంచి మెటీరియల్ తరలించే పని ఉండడంతో క్రషర్ వద్ద ట్రాక్టర్ వదిలి ఊళ్లోకి వచ్చేశాడు. ఉదయం వెళ్లి చూడగా ట్రాక్టర్‌కు ఉన్న హెడ్ లైట్, ఫ్యాన్, బ్యాటరీ చోరీకి గురైనట్టు గుర్తించాడు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ ఎల్.సురేష్ సిబ్బందితో సంఘటన స్థలానికి వచ్చి ట్రాక్టర్‌ను, పరిసరాలను పరిశీలించారు. చోరీపై పూర్తిస్థాయిలో విచారణ చేసి దొంగలను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

పన్ను మోసం.. చెరో సగం!

అనగనగా.. ఒక ఫేక్ కంపెనీ..
ఆ ఫేక్ కంపెనీకి ఒక ఫేక్ ఓనర్..
ఆ ఫేక్ ఓనర్.. ఆ ఫేక్ కంపెనీ పేరుతో వ్యాపార లావాదేవీలు చేసినట్లు ఫేక్ ఇన్‌వాయిస్‌లు సృష్టిస్తాడు.
ఆ ఇన్‌వాయిస్‌లని జీఎస్టీ ఆఫీస్‌లో సమర్పించి.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను కొట్టేస్తాడు.
ఆ ఫేక్ కంపెనీ ఓనర్‌కి ఈ సలహా ఇచ్చింది మాత్రం.. జీఎస్టీ ఉద్యోగే.!
ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రాగానే ఆ ఫేక్ ఓనర్.. ఈ ఒరిజినల్ ఉద్యోగి కలిసి చెరో సగం పంచేసుకుంటారు.
ఇది కథ కాదు.. జీఎస్టీ పరిధిలో నిత్యం జరిగే మోసం. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ కంపెనీలను గుర్తిస్తున్నా.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను మాత్రం ఏదో ఒక రూపంలో మోసగాళ్లు మోసం చేస్తూనే ఉన్నారు. అయితే వీరికి సాయం చేస్తోంది స్టేట్, సెంట్రల్ జీఎస్టీ కార్యాలయాల్లోని సిబ్బంది కావడం విచారించదగ్గ విషయం. అందుకే ఇంటి దొంగని ఈశ్వరుడైనా పట్టుకోలేరంటారు.



- ఫేక్ కంపెనీలతో నకిలీ ఇన్‌వాయిస్‌ల సృష్టి
- ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సొంతం చేసుకునేందుకు వ్యాపారుల కుయుక్తులు
- సహకరిస్తున్న జీఎస్టీ సిబ్బంది
- ఇన్‌పుట్ వచ్చిన వెంటనే చెరో సగం పంచుకుంటున్న వైనం
- జీఎస్టీ విశాఖ డివిజన్ పరిధిలో రూ.కోట్లలో మోసాలు

సాక్షి, విశాఖపట్నం: ఇంటర్ చదివి జులాయిగా తిరిగే ఓ యువకుడు రెండేళ్ల కిందట చిన్న చిన్న వ్యాపార సంస్థల్లో పని చేసి.. జీఎస్టీలో లొసుగులను పసిగట్టాడు. వైజాగ్, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ మొదలైన నగరాల్లో ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 20 ఫేక్ కంపెనీలు సృష్టించి పన్ను మోసాలకు పాల్పడేందుకు ఎత్తుగడ వేశాడు. 20 నకిలీ సంస్థలను ఏర్పాటు చేసి బిల్లులు జనరేట్ చేశాడు. ఈ సంస్థల నుంచి దేశంలోని వివిధ నగరాల్లోని కంపెనీలకు సరకు లావాదేవీలు జరిపినట్లు రూ.265 కోట్ల మేర నకిలీ ఇన్‌వాయిస్‌లు రూపొందించాడు. వీటిని ఉపయోగించుకుని రూ.31 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ని సొంత చేసుకునేందుకు ప్రయత్నించాడు. అప్పటికే 10 కోట్ల వరకు క్రెడిట్ చేసుకున్న యువకుడి వ్యవహారం చివరి నిమిషంలో జీఎస్టీ విజిలెన్స్ తనిఖీల్లో బట్టబయలైంది.

రూ.200 కోట్లకు పైగా రికవరీ.. అయినా..

నకిలీ ఇన్‌వాయిస్‌ల పేరుతో మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఫేక్ కంపెనీల పేరుతో పన్నుల చెల్లింపును ఎగవేసేలా వ్యూహాలను అమలు పరుస్తున్నారు. కొన్ని కంపెనీలు.. చిన్న చిన్న తప్పులతో దొరికిపోతుంటే.. చాలా మంది వ్యాపారులు మాత్రం దర్జాగా ఇన్‌పుట్ క్రెడిట్‌ని తమ ఖాతాల్లోకి జమ చేసుకుంటున్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ విశాఖపట్నం జోనల్ యూనిట్ పరిధిలో దాదాపు 350కి పైగా నకిలీ కంపెనీల గుట్టురట్టు చేసి రూ.200 కోట్లకు పైగానే రికవరీ చేశారు. అయినా ఫేక్ కంపెనీలు నకిలీ ఇన్‌వాయిస్‌లతో రెచ్చిపోతున్నాయి.

రాష్ట్ర పన్నుల శాఖలోనూ...

కేవలం సెంట్రల్ జీఎస్టీ పరిధిలోనే కాకుండా.. రాష్ట్ర పన్నుల శాఖ పరిధిలోనూ ఫేక్ ఇన్‌వాయిస్‌ల పేరుతో మోసాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా తుక్కు పరిశ్రమలు, సిమెంట్, స్టీల్ వ్యాపారులు, సిగరెట్లు, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న వస్తువుల విక్రయ వ్యాపారులు, వస్త్ర దుకాణాలు.. ఇలా చాలా వ్యాపారాల పేరుతో నకిలీ కంపెనీలున్నాయి. వాటిని కనిపెట్టడం పన్నుల శాఖ అధికారులకు కత్తిమీద సాముగా మారింది. వందల కోట్ల రూపాయలు కాజేస్తున్నా.. వారిని పట్టుకోలేకపోతున్నారు. ప్రతి బిల్లుని నిశితంగా పరిశీలించాల్సిన రాష్ట్ర పన్నుల శాఖ విశాఖ డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది.. తూతూ మంత్రంగా పరిశీలిస్తుండటంతో మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.

సిబ్బంది చేతివాటంతోనే..

స్టేట్ జీఎస్టీ విశాఖ డివిజన్ పరిధిలోని సర్కిళ్లతో పాటు ప్రధాన కార్యాలయంలోని కొందరు సిబ్బంది ఫేక్ కంపెనీలు సృష్టిస్తున్న వ్యాపారులతో చేతులు కలుపుతున్నట్లు సమాచారం. ఫేక్ ఇన్‌వాయిస్‌లను పక్కాగా ఎలా తయారు చేయాలి? వాటిని ఏ సమయంలో సమర్పిస్తే.. ఎవరికీ అనుమానం రాకుండా పూర్తిస్థాయిలో వెరిఫికేషన్ జరగదు.. ఎలా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ని సొంతం చేసుకోవచ్చు.. ఇలా సమగ్ర వివరాలతో స్కెచ్ వేసి.. తూ.చ తప్పకుండా అమలయ్యేటట్లుగా ప్లాన్ చేస్తున్నారు. ఫైల్స్ తమ దగ్గర నుంచే వెళ్లేలా చూసుకుని.. ఎవరికీ అనుమానం రాకుండా ఇన్‌పుట్‌ని కొట్టేస్తూ.. చెరి సగం పంచేసుకుంటున్నారు. స్టేట్ ట్యాక్స్ కార్యాలయంలోని కొందరు సిబ్బందితో పాటు సూర్యాబాగ్, సిరిపురం, ద్వారకానగర్, దాబాగార్డెన్స్, కురుపాం మార్కెట్, గాజువాక, అనకాపల్లి, చినవాల్తేరు సర్కిళ్ల పరిధిలో ఈ తరహా నకిలీ ఇన్‌వాయిస్‌లు ఎక్కువగా వస్తున్నాయి. వీరికి మోసగాళ్లకు ఆయా సర్కిళ్ల పరిధిలో కొందరు ఉద్యోగులు సహకారం అందిస్తూ.. ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్నారు. దీని వల్ల జీఎస్టీ వసూళ్లు పెరుగుతున్నా.. ఇన్‌పుట్ క్రెడిట్ కుంభకోణంతో ఖజానాకు చిల్లు పెడుతున్నారు. ఉన్నతాధికారులెవ్వరూ పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవడంతో ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నారు.

సరైన పత్రాలు లేని 75 వాహనాలు సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

రావికమతం : నేర నియంత్రణలో భాగంగా కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో కొత్తకోట గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. బుధవారం ఉదయాన్నే పలు వీధుల్లో గుంపులుగా పోలీసులు తిరుగుతూ రోడ్డుపై వచ్చే వాహనాలతో పాటు ఇళ్ల వద్ద గల వాహనాలను కూడా పరిశీలించారు. ఆయా వాహనాల లైసెన్సులు, ఇతర పత్రాలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అల్లర్లు జరగకుండా , బయటి వ్యక్తులు నివారించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని దీని వల్ల నేర నియంత్రణ జరుగుతుందని సీఐ అప్పలనాయుడు ఈ సందర్భంగా తెలిపారు. 75 బైక్‌లు,10 వరకూ ఆటోలు, ఇతర వాహనాలను ఈ విధంగా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి





అప్పలనాయుడు మృతదేహం (ఇన్‌సెట్) అప్పలనాయుడు (ఫైల్)

కోటవురట్ల : మరి కొద్ది నిమిషాల్లో ఇంటికి క్షేమంగా చేరాల్సిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. వివరాల్లోకి వెళితే యండపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన గుడివాడ అప్పలనాయుడు(46) మృతి చెందాడు. పొలం నుంచి సైకిల్‌పై ఇంటికి వెళుతూ మెయిన్‌రోడ్డు నుంచి ఊళ్లోకి వెళ్లే రోడ్డుకు మలుపు తిరుగుతుండగా వెనక నుంచి వేగంగా బైక్‌పై వచ్చిన సన్యాసిరాజుపాలేనికి చెందిన గెంజి కన్నబాబు ఢీకొట్టాడు. ఈ ఘటనలో అప్పలనాయుడు తలకు తీవ్ర గాయం కావడంతో ముక్కు చెవుల నుంచి రక్తస్రావమైంది. నర్సీపట్నం ఆస్పత్రికి తరలించేందుకు ఆటో ఎక్కిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. మృతునికి భార్య అచ్చియ్యమ్మ, ఇద్దరు పిల్లలు కాగా భార్య అచ్చియ్యమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

క్లుప్తంగా

నేడు రెండో విడత చందన సమర్పణ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం దిబ్బవీధి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గురువారం స్వామివారికి రెండో విడత చందన సమర్పణ చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు శ్రీలక్ష్మి, ఆండాళ్ అమ్మవార్లకు పంచామృతాభిషేకం, పట్టుచీర అలంకరణ, 7 గంటలకు స్వర్ణ సంపెంగ పుష్పార్చన, సాయంత్రం 7 గంటలకు స్వామివారికి దీపాలంకరణ సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

'రద్దీ వేళ రైళ్ల రద్దు తగదు'

అనకాపల్లి: వేసవి కాలంలో విద్యార్థులకు సెలవులు కావడంతో కుటుంబ సమేతంగా పుణ్యక్షేత్రాలు, బంధువుల ఇళ్లకు వెళ్లే సమయంలో రద్దీకి అనుగుణంగా రైళ్ల సంఖ్యను పెంచాల్సింది పోయి, రైళ్లను రద్దు చేయడం అన్యాయమని కన్జ్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో ఆక్షేపించారు. ఈ విషయంపై రైల్వే బోర్డుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అత్యాధునిక వ్యవస్థ కలిగిన రైల్వేశాఖ ఏడాదిగా నిర్వహణ, ఆధునీకీకరణ పేరిట డిమాండ్ ఉన్న రైళ్లను రద్దు చేస్తోందన్నారు. ప్రయాణికుల హక్కుల్ని కాలరాసేలా రైల్వే అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏ పనికైనా రైల్వే సిటిజన్ చార్టర్ ప్రకారం నిర్దేశిత గడువులోగా పూర్తి చేయకుండా, ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే అన్ని రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

జాబ్ మేళాలో 50 మంది ఎంపిక



జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులతో వివిధ కంపెనీల ప్రతినిధులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ఆదినారాయణ మహిళా కళాశాలలో బుధవారం జరిగిన జాబ్ మేళాలో 50 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ కొణతాల అనూష తెలిపారు. విశాఖలోని మద్దిలపాలేనికి చెందిన మ్యాజిక్ బస్ ఇండియా టెలికాలర్ పోస్టుకు, అచ్యుతాపురం యకహోమా టైర్స్ కంపెనీతో పాటు, జాబ్ డీలర్ కంపెనీల్లో వివిధ ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహించినట్లు పేర్కొన్నారు. 90 పోస్టులకు జరిగిన ఇంటర్వ్యూలో 50 మంది ఎంపికైనట్లు వెల్లడించారు. రెండు రోజుల్లో నియామకపత్రాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రతినిధులు నాగచరణ్, రాజు, నేహా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

నటరత్నాలు	: రాజా
మిరల్	: సత్యనారాయణ స్క్రీన్-1
కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ద ఏప్స్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటీ అడక్కు	: పర్తిసాయి
అపరిచితుడు	: వెంకటేశ్వర
రత్నం	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 415 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,800	5,150
మొదటి రకం	4,670	5,190
రెండో రకం	4,145	4,400
మూడోరకం	3,735	3,870

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 84 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-40 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-27 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 426 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 389 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(0892 4223595)ని సంప్రదించవచ్చు.

మేలుకోకుంటే.. మురుగు ముంపు తప్పదు



వేల్పుల వీధి పార్క్ సెంటర్ డ్రైనేజీ దుస్థితి

వేసవి చివరి దశకు చేరుకుంది. వర్షాకాలం ఆగమనానికి సూచనగా తొలకరి జల్లులు అడపా దడపా కురుస్తున్నాయి. ఏటా వేసవిలోనే డ్రైనేజీలు, కాల్వల్లో పూడిక తొలగింపు చేపట్టేవారు. ఈసారి ఎన్నికల హడావుడిలో అధికారులు ఆ దిశగా దృష్టి సారించలేదు. దీంతో డ్రైనేజీలు ఎక్కడికక్కడ చెత్తాచెదారంతో పూడుకుపోయాయి. వర్షం కురిస్తే రోడ్లపైకి మురుగునీరు చేరి, వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. దీంతో పూడికల తొలగింపుపై పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రామచంద్ర థియేటర్ వద్ద రోడ్డుపైకి చేరిన మురుగునీరు

- డ్రైనేజీల్లో పూడిక తొలగింపుపై జీవీఎంసీ నిర్లిప్తత
- వర్షాకాలానికి ముందే పూడికలు తొలగించాలి
- తొలగించకపోతే సాగునీటికీ ఇబ్బందే

అనకాపల్లి: జోన్ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పట్టణ పరిధిలో సుమారు 1.50 లక్షల జనాభా నివసిస్తున్నారు. ఓ మాదిరి చిన్న, పెద్ద కాలువలు కలిపి సుమారు 30 కి.మీ. మేర డ్రైనేజీ వ్యవస్థ ఉంది. గతేడాది రూ.97 లక్షలతో ఈ డ్రైనేజీలో పూడిక తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఇంకా ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభం కాలేదు.

జీవీఎంసీ నిర్లిప్తత

జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోని ఐదు వార్డుల్లో పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు డ్రైనేజీల్లో పూడికలు తొలగించాలి. రోగాలు ప్రబలకుండా దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలి. పట్టణ పరిధిలోని డ్రైనేజీలన్నీ ప్రధాన కాలువలకు అనుసంధానంగానే ఉన్నాయి. వీటిని డ్రైనేజీ అవుట్ కట్స్ ద్వారా శుభ్రం చేసి, పంట కాల్వల నుంచి వ్యవసాయానికి మళ్లిస్తారు. అయితే గత కొన్ని రోజులుగా పట్టణ డ్రైనేజీల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగింపు పనుల్ని పారిశుధ్య కార్మికులు చేపట్టిన దాఖలాల్లేవు. దీంతో ఏ మాత్రం వర్షం పడినా డ్రైనేజీ మురుగంతా రోడ్లపైకి చేరి, దుర్గంధం వ్యాపిస్తోంది. తక్షణమే డ్రైనేజీల్లో పూడిక తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సాగునీటికీ ఇబ్బందే..

పట్టణ డ్రైనేజీ వ్యవస్థ ద్వారా వచ్చే నీటిని రెండు ప్రధాన మార్గాల ద్వారా పంట భూములకు మళ్లిస్తున్నారు. శారదానది ఒడ్డున ఎల్‌ఐసీ కార్యాలయం, గవరపాలెం సుంకరమెట్ట జంక్షన్‌ల వద్దనున్న పంపింగ్ వ్యవస్థ ద్వారా శంకరంలోని 15 ఎంఎల్‌డీ సామర్థ్యమున్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు డ్రైనేజీ నీటి చేరవేస్తారు. అక్కడ ఆ నీటిని శుద్ధి చేసి, పంట కాల్వలకు విడిచిపెడుతుంటారు. కాల్వల్లో పూడిక తొలగింపు చేపట్టకపోతే సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సామర్థ్యానికి సరిపడా మురుగునీరు చేరే పరిస్థితి ఉండదు. దీంతో పట్టణ పరిసర ప్రాంత పంట భూములకు సాగునీటికీ ఇబ్బంది తప్పని స్థితి.

పూడిక తొలగించాలి



వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ప్రధానంగా డ్రైనేజీలను పునరుద్ధరించాలి. ఏటా క్రమం తప్పకుండా పూడికతీత పనులు చేపట్టాలి. ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి, డ్రైనేజీల్లో నీరు పారే అవకాశాలు కనిపించడం లేదు. ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

– పడాల కోటి, ఉడ్‌పేట, అనకాపల్లి

విష జ్వరాల ముప్పు



ప్రధానంగా వీధి కాలువలు శుభ్రం చేస్తే వర్షాలు పడే సమయంలో వర్షపు నీరు రహదారులపైకి రాకుండా ఉంటుంది. నేరుగా ప్రధాన కాలువలకు నీరు చేరిపోతుంది. వీధి కాలువ నీరు రోడ్లపై ప్రవహించడం ద్వారా డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఎక్కువ.

– పి.సోమేష్, వేల్పులవీధి, అనకాపల్లి

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆలయ శత జయంత్యుత్సవాలు



కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అమ్మవారి ఆలయంలో శాంతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా వైశాఖమాసం పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి రామనాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో నగర సంకీర్తన, గోపూజ, ప్రదక్షిణలు, అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, నవకలశ స్నపనం, నీరాజన మంత్ర పుష్పములు, శాంతి హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అమ్మవారి ప్రతిష్ట శతజయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీబీ రంగాచారి

అనకాపల్లి: వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అందించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పీబీ రంగాచారి తెలిపారు. మండలంలోని వెంకుపాలెం గ్రామంలో వ్యవసాయ సహాయకులకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి వారికి కావాల్సిన విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా సూచించారు. రూ.880 విలువ చేసే పది కిలోల జనుము, జీలుగ విత్తనాల బ్యాగ్‌లను రాయితీగా రూ.440కే అందిస్తున్నామన్నారు. రూ.1,072 విలువైన పిల్లిపెసర విత్తనాలు రూ.536 చెల్లించి కొనుగోలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, వ్యవసాయ విస్తర్ణ అధికారి ఎం.శ్రీనివాసరావు, ఎంపీఈవో జానకి, సచివాలయం వ్యవసాయ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు స్టాప్ బోర్డుల అందజేత



స్టాప్ బోర్డులతో కశింకోట సీఐ వినోద్‌బాబు, రామ్‌కో సిమెంట్ ప్రతినిధులు

కశింకోట: స్థానిక పోలీస్ స్టేషన్‌కు రామ్‌కో సిమెంట్ పరిశ్రమ 50 స్టాప్ బోర్డులను సమకూర్చినట్లు సీఐ ఎం.వినోద్‌బాబు బుధవారం మీడియాకు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ఉపకరించే విధంగా రూ.3.50 లక్షలు వెచ్చించి వీటిని అందించారన్నారు. అనకాపల్లి డీఎస్పీ కార్యాలయానికి కూడా మరో 75 స్టాప్ బోర్డులు అందించినట్లు పేర్కొన్నారు. ఇందుకు పరిశ్రమ యాజమాన్యాన్ని, నిర్వాహకులను ఆయన అభినందించారు.

కార్యక్రమంలో మండలంలోని ఏఎస్ పేట వద్దనున్న సిమెంట్ పరిశ్రమ హెడ్ పి.వీరపాండ్యన్, ఎం.కళాధర్, హెచ్ఆర్ మేనేజర్ ఎం.యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణి ముత్యాలమ్మ పండగ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పరవాడ: పరవాడ గ్రామంలో వెలసిన బ్రాహ్మణి ముత్యాలమ్మ తల్లి పండగను గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా అమ్మవారు స్థానికుల పూజలను అందుకుంటున్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచి భక్తులు తరలివస్తారు. పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించి, పూజలు జరిపి తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో పరవాడ పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని, అమ్మవారి దర్శనం అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తారు. రాత్రికి డప్పులు, చిడతలు, తప్పెటగుళ్లు, డ్యాన్సులు, నేల డ్యాన్సులతో అమ్మవారిని వీధుల్లో ఊరేగిస్తారు. భారీ బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహిస్తారు. భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

రాజారామ్‌మోహన్‌రాయ్ చిరస్మరణీయుడు

కశింకోట: మండలంలోని గొబ్బూరులో ప్రముఖ సంఘ సంస్కర్త రాజారామ్ మోహన్‌రాయ్ జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళాభ్యుదయానికి ఆయన చేసిన కృషిని ప్రస్తుతించారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఉగ్గిన రమణమూర్తి, పాల సంఘం అధ్యక్షుడు పప్పల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ నారాయణరావు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరడానికి అవకాశం ఉందని చెప్పారు. టెన్త్ క్లాసు పరీక్షల్లో 550 మార్కులు సాధించిన విద్యార్థులకు రామదాస్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తుందన్నారు. ఎన్టీపీసీ సౌజన్యంతో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కల్పిస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు కళాశాలలో చేరి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మా కళాశాలలో చేర్పించండి..

ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల ప్రచారం



రామచంద్రపాలెంలో విద్యార్థుల తల్లిదండ్రులకు కరపత్రాలను అందిస్తున్న లెక్చరర్లు

కోటవురట్ల: నాణ్యమైన విద్యను అందిస్తున్నాం.. నిష్ణాతులైన అధ్యాపకులు విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకుంటున్నారు..మీ పిల్లలను మా కళాశాలలో చేర్పించండి అంటూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఇంటిబాట పట్టారు. విద్యార్థుల ఇళ్లను సందర్శించి వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లభిస్తున్న విద్యా సేవలను వివరిస్తున్నారు. ప్రైవేటు కళాశాలలు విపరీతంగా పెరిగిపోయాయి. పోటీతత్వం పెరిగిపోయింది. దాంతో పేదలు సైతం కార్పొరేట్ కళాశాలలపై మోజుతో రూ.లక్షలు వదిలించుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాలలో అధునాతన భవనాలు, నిష్ణాతులైన అధ్యాపకులతో మెరుగైన విద్యా బోధన ఉన్నప్పటికీ ప్రైవేటు మోజుతో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. దాంతో లెక్చరర్లే విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకుని మీ పిల్లలను మా కళాశాలలో చేర్చండి..వారికి మంచి విద్యను అందించి ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత మాదంటూ వివరిస్తున్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నారు. పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా మెరుగైన విద్యను అందిస్తోందని అవగాహన కల్పిస్తున్నారు.

గోవిందపాలెంలో కార్డన్ అండ్ సెర్చ్



గోవిందపాలెంలో స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

రాంబిల్లి : గోవిందపాలెంలో బుధవారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి రికార్డులు లేని 20 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక ఆటోను సీజ్ చేసారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని సీఐ పేర్కొన్నారు. ఎటువంటి అల్లర్లు, గొడవలు, తగాదాల జోలికి పోవద్దని హితవు పలికారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 9 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో విస్తం ప్రతినిధులు

పెందుర్తి: మండలంలోని పినగాడి సమీపంలో ఉన్న విస్తం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. యోకోమో కంపెనీలో 9 మంది డిప్లొమా కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు కొలువులు లభించినట్లు డిప్లొమా ప్రిన్సిపాల్ కె.వి.కిరణ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఇంజినీరింగ్ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.శివకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ అధికారులు ఇ.కిరణ్‌కుమార్, ఎం.వి.జె.టి అరుణ్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాతో ఆరోగ్యం



విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు



విద్యార్థులకు సూర్య నమస్కారం చేయిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు సీతారామమూర్తి

పాయకరావుపేట : విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, యోగా, సూర్య నమస్కారం ఎంతో మంచి ఆరోగ్యమని విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.సీతారామమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం యోగా పై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థికీ క్రీడలు ఎంతో ఆనందాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. యోగాతో మానసిక ప్రశాంతతో పాటు మంచి ఆరోగ్యం వస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ మంచి నడవడిక, అలవాట్లు అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. అంతకుముందు వందేమాతరం గీతంతో కార్యక్రమం ప్రారంభించారు.

సత్ప్రవర్తన, క్రమశిక్షణ అలవర్చుకోవాలి



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

రాంబిల్లి : విద్యార్థులు మంచి ప్రవర్తన, క్రమశిక్షణ అలవర్చుకోవాలని రీసోర్స్ పర్సన్స్ జి. నూకినాయుడు, వెంకటలక్ష్మి అన్నారు. దిమిలి శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో రీసోర్స్ పర్సన్స్ నీతికథలు చెప్పారు. క్రమశిక్షణ , సత్ప్రవర్తన వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం పలు ఆటలను ఆడించారు. వేసవి శిక్షణతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని లైబ్రేరియన్ ఎస్.శకుంతల అన్నారు.

3న సోమేశ్వరాలయ భూముల వేలం

మునగపాక : మండలంలోని ఒంపోలు సదానంద సోమేశ్వర స్వామి ఆలయ భూములకు జూన్ 3న వేలం పాట జరుగుతుందని ఆలయ ఈవో పీఎస్ఎన్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయానికి చెందిన 5.40 ఎకరాల స్థలానికి సంబంధించి వేలం పాట జరుగుతుందన్నారు. 3వ తేదీన సాయంత్రం 4 గంటలకు జరిగే వేలం పాటను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేలం పాట దక్కించుకున్న వారికి 04-06-2024 నుంచి 03-06-2017 వరకు సాగు కాలపరిమితి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పాటదారులు సద్వినియోగం చేసుకోవాలని మూర్తి కోరారు.

పచ్చిరొట్ట విత్తనాలకు దరఖాస్తు చేసుకోండి



పచ్చిరొట్ట విత్తనాల బస్తాలను పరిశీలిస్తున్న ఏవో సుమంత

రాంబిల్లి : రాయితీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో సి. సుమంత సూచించారు. బుధవారం ఆమె దిమిలి, మురకాడ, కట్టుబోలు రైతు భరోసా కేంద్రా(ఆర్‌బీకే)లను సందర్శించారు. జీలుగ, జనుము, పిల్లిపిసర పచ్చిరొట్ట విత్తనాల స్టాక్‌ను పరిశీలించారు. వీటిని ప్రభుత్వ ఆదేశాల మేరకు 50 శాతం రాయితీపై అందజేయడం జరుగుతుందన్నారు. వీటిని సాగు చేసి దుక్కిలో కలియదున్నితే మంచి దిగుబడి పొందవచ్చన్నారు. వీఏఏలు మేఘన, ప్రశాంతి, ఎంపీహెచ్‌వో రామారావు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న శాఖా గ్రంథాలయాధికారి రమణ

మునగపాక : విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని మునగపాక శాఖా గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ కోరారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివి మరింత విజ్ఞానాన్ని పొందాలని విద్యార్థులకు సూచించారు. ఇటువంటి శిక్షణ తరగతుల ద్వారా పిల్లల్లో మరింత విజ్ఞానం పెరుగుతుందన్నారు. జూన్ 7 తేదీతో శిక్షణ పూర్తవుతుందన్నారు. అదే రోజు విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.